క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేశప్ప మృతి



కేశప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బిట్రగుంట పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేశప్ప(60) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కేశప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, సీనియర్ నాయకులు కిష్ట, కొత్త కోట కేశప్ప, మండల గ్రామ సచివాలయా కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు: మండల కేంద్రంలో ఈనెల 17 నుంచి 25 వరకు సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కేసీ మనోహర్ తెలిపారు. 17న శుక్రవారం ధ్వజారోహణం,18 శనివారం హంసవాహనం, 19న బృంగివాహనం, 20న శేషవాహనం, 21న నందివాహనము, 22న కళ్యాణోత్సవం, 23న రథోత్సవం(తేరు), 24న పార్వేటోత్సవం, 25న వసంతోత్సవం, పుష్పయాగం, ఊంజల్‌సేవ నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తాదులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సంగమేశ్వరుడి కృపాకటాక్షములు పొందాలని ధర్మకర్త సూచించారు.

రోగులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. రంగం పెద్ద ఈశ్వరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారంతో రోగులకు కార్యక్రమాన్ని నిర్వహించామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, సభ్యులు వైకే శ్రీనివాసులు, సుంకు సుకుమార్, గర్రె రమేష్‌బాబు, వంకదారి రామచంద్రగుప్త తెలిపారు.

న్యాయం చేయండి

గాండ్లపెంట: దాడి ఘటనకు సంబంధించి తనకు న్యాయం చేయాలని కత్తివారిపల్లికి చెందిన వద్దిరెడ్డి రాఘవరెడ్డి పోలీసులను కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన సోమయాజుపల్లి టీడీపీ ఎంపీటీసీ జయరామక్రిష్టారెడ్డితో పాటు మంజునాథరెడ్డి, లోకేశ్‌రెడ్డి, రామాంజులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి ఈ నెల 13న రాత్రి తనపై కర్రలతో అకారణంగా దాడి చేశారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఆదే రోజ రాత్రి ఫిర్యాదు చేశామని, వారి పోలీసుల సలహా మేరకు కదిరి ఆసుపత్రిలో చేరామన్నారు. అయితే పోలీసులు తమ వద్ద ఫిర్యాదు తీసుకున్నారని, కానీ దాన్ని కాకుండా వారే స్వతహాగా ఫిర్యాదు రాసుకుని కేసు నమోదు చేశారన్నారు. దాడిపై వాస్తవికంగా విచారించి న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై ఎస్ఐ క్రిష్ణవేణిని వివరణ కోరగా సోమవారం రాత్రి ఇరు వర్గాల వారు వ్యక్తిగత కక్షలతో ఘర్షణ పడ్డారన్నారు. గ్రామంలో విచారించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామని ఎస్ఐ స్పష్టం చేశారు.

కళాకారులకు చేయూత



కోలాటం కళాకారులకు నగదు అందిస్తున్న నాయకులు

తనకల్లు: గోళ్లవారిపల్లి వారిజనవాడకు చెందిన కోలాటం కళాకారులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ యువనేత ఎంజీ రెడ్డి చేయూతనందించారు. ప్రజాదరణ తగ్గడంతో కళాకారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఎంజీ రెడ్డి గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్ చేత రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అడగకపోయినా తమ పరిస్థితిని మంచి మనస్సుతో అర్థం చేసుకొని తమకు ఆర్థికంగా అండగా నిలిచిన ఎంజీ రెడ్డికి కోలాటం కళాకారులు కృతజ్ఞతలను తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- పాల దిగుబడిపై ప్రభావం
- మృత్యువాత పడే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



పశువులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

బత్తలపల్లి: నోరులేని పశువులు అనారోగ్యం సంభవిస్తే అవి నోరు తెరిచి మనకి చెప్పలేవు. పశుపోషకులే వాటిని గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. అజాగ్రత్త వహిస్తే పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వేసవిలో పశువులు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చునని బత్తలపల్లి మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి సూచించారు.

శరీర ప్రక్రియ మందగిస్తుంది..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమటద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సరిగా పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

ధర్మవరం నియోజకవర్గంలో పశువులు, గొర్రెలు, మేకల వివరాలు ఇలా..

మండలం	ఎద్దులు, ఆవులు	ఎనుములు	గొర్రెలు	మేకలు
ధర్మవరం	12,000	4,000	85,000	15,000
బత్తలపల్లి	7,500	2,300	85,000	11,000
తాడిమర్రి	7,000	2,500	80,000	9,000
ముదిగుబ్బ	14,000	4,000	1,35,000	15,000



గుర్నాథరెడ్డి

లక్షణాలు ఇలా..

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసారం వ్యాధి వ్యాపిస్తుంది.

చికిత్స విధానం ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలివీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రదించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్ట్రోజ్ సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో ఎండలోకి పశువులను వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు పంపాలి. పశువులను రోజుకు మూడు, నాలుగు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురువుతాయి. వాటిపై తరుచుగా చల్లటి నీళ్లను చల్లుతుండాలి. గాలి బాగా ప్రసవించేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లుపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళల్లో నీళ్లను చల్లుతుండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనెసంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

అన్నా...మన ఊరిలో ఓట్లు ఎన్ని పోలయ్యాయి!

- ఎక్కడ ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయంటూ లెక్కలు
- ఫలితాలపై సాగుతున్న చర్చలు

బత్తలపల్లి: సార్వత్రిక పోలింగ్ పూర్తవడంతో సర్వేవీరులు విజృంభిస్తున్నారు. ఎక్కడ చూసినా గెలుపోటములపైనే చర్చలు. అయితే ఎవరికి వారు తాము పక్కాగా సర్వే చేశామని చెప్పడం సామాన్యులను తికమకపెడుతున్నాయి. ఏ పార్టీకి చెందిన వారు ఆ పార్టీకి అనుకూలంగా ఫలితాలు చెబుతుండటం గందరగోళానికి గురి చేస్తోంది. సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న పూర్తీ కాగా వీటి ఫలితాలు వచ్చే నెల 4న ప్రకటించనున్నారు. ఫలితాల విడుదలకు ఎక్కువ సమయం ఉండటంతో నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠగా ఉంది. గతంలో కంటే ఓటింగ్ శాతం పెరిగినా విజయం ఎవరిని వరిస్తుందో, ఎవరికెన్ని ఓట్లు వస్తాయోనని పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తీస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గెలుస్తున్నారని భారీగా పందేలు కాస్తున్నట్లు సమాచారం. ఫలితాల కోసం సుమారు 20 రోజులు పైబడి ఎదురుచూడాల్సి రావడంతో ప్రతి ఒక్కరూ సర్వే వీరుల్లా మారుతున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ నేతలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విజయంపై కాకుండా మెజార్టీపై పందేలు కాయడం కొసమెరుపు.

వాదోపవాదాలు..

బత్తలపల్లి మండలంలో ప్రతి కూడలిలో నలుగురు ఓ చోటకు చేరితే చాలు కొందరు తాము స్వయంగా సర్వే చేశామని, అవతలివారిని మాట్లాడనివ్వకుండా తాము చెప్పిందే నిజమని వాగ్వాదానికి దిగుతున్నారు. ఉదయం నడక సమయంలోనూ కొందరు తమ పార్టీ అధికారంలోకి వస్తుందంటే తమ పార్టీ అధికారంలోకి వస్తుందంటూ వాదోప వాదనలు చేస్తున్నారు.

టీడీపీ గూండాలకు భయపడేది లేదు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



టీడీపీ గూండాల దాడిలో గాయపడిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎన్నికల్లో ఓటమి భయంతో తెలుగుదేశం పార్టీ గూండాలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని ఏ ఒక్క నాయకుడు, కార్యకర్త వారికి భయపడాల్సిన అవసరం లేదని అండగా ఉంటానని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుక్కపట్నం మండలం కొత్తకోటలో ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ ,సురేష్‌పై టీడీపీ గూండాలు దాడులకు పాల్పడి గాయపరిచారు. గురువారం ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని వారిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వచ్చే నెల 4వ తేదీన మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, తాను ఎమ్మెల్యేగా, జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేయటం తథ్యమన్నారు. పార్టీ నాయకుల జోలికి వచ్చినా ఏ ఒక్కరినీ విడిచి పెట్టమని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, కొత్తకోట కేశప్ప, కిష్ట, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గణికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



అమడగూరులో..



తనకల్లులో..

ధర్మవరం అర్బన్: డెంగీ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్‌నాయక్, వైద్యులు పుష్పలత, శ్రావణి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్ సూచించారు. పట్టణంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు డెంగీ సోకితే లక్షణాలు వివరించడంతోపాటు నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి: జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా ధర్మవరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌నాయక్, డాక్టర్ పుష్పలత శ్రావణి, ఎంఎస్ఓ జయరాంనాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పురవీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల 5 నుంచి 6 రోజులు పాటు జ్వరం వస్తుందన్నారు. తీవ్రమైన తలనొప్పి, కంటి కదలికలతో కన్నునొప్పి, కండరాల నొప్పి, ఎక్కువ దద్దుర్లు వికారం, వాంతులు డెంగీ లక్షణాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఏఎన్ఎంతో చికిత్స తీసుకోవచ్చన్నారు. వైద్యాధికారి డాక్టర్ గంగిరెడ్డి, సీహెచ్ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

తనకల్లు: ప్రాణాంతక డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉధృతిని అరికట్టాలన్నారు. దోమకాటు వల్ల డెంగీతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా విధిగా దోమ తెరలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బది పాల్గొన్నారు.

అమడగూరు: ప్రతి ఒక్కరూ దోమ కాటు నుంచి కాపాడుకోవాలని వైద్యాధికారి అపర్ణ పేర్కొన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ప్లకార్డులు చేత పట్టుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ లక్షణాలు, నివారణకు చర్యలను తెలియజేశారు. సీహెచ్ఓ ఫకృద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ఎనుములపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జ్యోత్స్న డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం వృద్దులకు బీసీజీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్ప, సీహెచ్ఓ నగేష్ పీహెచ్ఎన్ లలితకుమారి ఎస్‌యూఓ రమణయ్య, డీపీసీ మల్లికార్జున, పీపీఎం నాగేంద్ర డీపీఎస్ ఆంజనేయులు హెచ్‌సీ చంద్రనాయక్, సూపర్‌వైజర్లు వెంకటరమణ చంద్రకళ, ఎస్‌టీఎస్ ఆబిద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పీహెచ్‌సీ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ భానుప్రకాష్ డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పరిశీలన

స్థానిక పీహెచ్‌సీలోవయోజన క్షయ టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ పరిశీలించారు. టీకా ప్రాముఖ్యతను వివరించడంతోపాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బీసీజీ టీకాతో క్షయ నిర్మూలన



తాడిమర్రి పీహెచ్‌సీలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్యాధికారులు



ధర్మవరంలో టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా

తాడిమర్రి: బీసీజీ టీకాతో క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్యాధికారులు హరిత, గోవర్ధన్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వారు సిబ్బందితో కలసి వయోజనులకు క్షయ నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 12 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టగా అందులో తాడిమర్రిని ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకుల నుంచి 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు టీకాలు వేస్తామన్నారు. ముందుగా దీర్ఘకాలిక జబ్బులు, హైరిస్క్ వ్యాధిగ్రస్తులు, క్షయ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులకు టీకాలను వేస్తామని తెలిపారు. టీకాలు వేయించుకున్న వారు మొదటి మూడు నెలలు ప్రతి నెల, తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి మూడేళ్లపాటు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్ఓ హేమలత, ఎంపీహెచ్ఓ నారాయణమ్మ, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: వయోజనుల కోసం బీసీజీ టీకాలు వేస్తున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని 20వ సచివాలయంలో గురువారం 60 ఏళ్లు దాటిన వారికి బీసీజీ టీకాలను వేశారు. టీకాల కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ పర్యవేక్షించారు. 60 ఏళ్లు దాటిన వారికి, చక్కెర వ్యాధిగ్రస్తులు, పొగాకు తాగేవారికి, టీబీ గతంలో వచ్చి నయం అయిన వారికి, వారి కుటుంబ సభ్యులకు ఈ టీకా వేయనున్నామని తెలిపారు. సాయినగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శ్వేత, టీబీ సూపర్‌వైజర్ క్రిష్టప్ప, ఏఎన్ఎం అనిత, అర్బన్ సూపర్‌వైజర్ అన్నా లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: పోతుకుంట గ్రామంలో గురువారం జరిగిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డిప్యూటి డీఎంహెచ్ఓ సెల్వియా పరిశీలించారు. కార్యక్రమంలో దర్శనమల వైద్యాధికారి పుష్పలత, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, జైతూన్‌బీ, పోతుకుంట ఆరోగ్య సిబ్బంది శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌తో క్షయ నివారణ

కనగానపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనకు బీసీజీ వ్యాక్సిన్ బాగా పనిచేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా తెలిపారు. మండలంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. ముక్తాపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను డిప్యూటీ డీఎంహెచ్ఓ పర్యవేక్షించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. 60 ఏళ్ల పైబడిన వారితో పాటు, క్షయ వ్యాధి సోకిన ప్రతి ఒక్కరికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. కాగా మండల వ్యాప్తంగా 12 గ్రామ సచివాలయాల పరిధిలో 446 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, ధనమ్మ, సీహెచ్ఓలు, ఎంపీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లుపాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: ఏ.కొత్తలపల్లిలో భూ వివాదానికి సంబంధించి ఇద్దరిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామంలోని 297 సర్వే నంబర్‌లో జయచంద్రారెడ్డి తనకు వచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ మేరకు పొలం దున్నుకుంటుండగా పార్థసారథిరెడ్డి వచ్చి నీకు ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిన వైపు దున్నుకోకుండా వేరే చోట ఎందుకు దున్నుతున్నావని అడిగాడు. దీంతో జయచంద్రారెడ్డి ఆగ్రహంతో పార్థసారథిరెడ్డిని కట్టెతో కొట్టాడు. దీంతో ఇద్దరూ గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు మండల మీట్

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ భాగ్యలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పంచాతీ కార్యదర్శులు, ఇతర అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

20 మంది బైండోవర్

కదిరి అర్బన్: గొల్లోల్ల చెరువుకు చెందిన 20 మందిని గురువారం రూరల్ మండల పోలీసులు బైండోవర్ చేశారు. ఈ నెల 14న గ్రామంలో జరిగిన గొడవల దృష్ట్యా ముందస్తుగా వీరిని బైండోవర్ చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

నేడు సంతాన సాఫల్యంపై అవగాహన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దేవి నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం సంతాన సాఫల్యం ఉచిత అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ పద్మ గురువారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. 8105073250, 9912031139 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 20న డయాబెటీస్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఓపీ చూసి వైద్య సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల ప్రశాంతతకు సహకరించండి



వేల్పుమడుగు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ఎన్నిక ఫలితాలు వెలువడనున్న ఫలితాల నేపథ్యంలో గ్రామాల ప్రశాంతతకు సహకరించాలని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు ఎస్ఐ శ్రీనివాసులు రాజకీయ పార్టీల నేతలు, పాత కేసుల్లోని నిందితులను సూచించారు. గురువారం దంపెట్ల, డి.చెర్లోపల్లి, ఎం.చెర్లోపల్లి, వెంకటగారిపల్లి, నల్లబోయనపల్లి, పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగానే నిర్వహించామని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాలు వెలువడిన తరువాత కూడా సహకరించి ప్రశాంత వాతావరణం కల్పించుకుందామన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా జీవించండి

గాండ్లపెంట: గ్రామంలో ఎలాంటి గొడవలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు గజ్జలవాండ్లపల్లి గ్రామస్తులకు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన గ్రామంలో పర్యటించారు. ఓ హత్యకేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల సమీప బంధువులు చనిపోవడంతో బెయిల్‌పై గ్రామానికి వచ్చారు. బైయిల్‌పై వచ్చిన ఖైదీలతో సీఐ మాట్లాడి అంత్యక్రియలు అనంతరం గ్రామం విడిచి వెళ్లిపోవాలని తెలియజేయడంతోపాటు గ్రామంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐ క్రిష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యం



బొమ్మలను చూపుతున్న చిన్నారులు

చెన్నేకొత్తపల్లి: చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా టింబక్ట్ కలెక్టివ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చిగురు సెంటర్ ఇన్‌చార్జ్ అలివేలమ్మ తెలిపారు. న్యామద్దెల రోడ్డులోని గ్రంథాలయంలో ఆటపాటలు, బంకమట్టితో పలు రకాల బొమ్మల తయారీ, పెయింటింగ్, ఆర్గామి పేపర్ క్రాఫ్ట్, కులాజ్ వర్క్ తదితర వాటిపై గత పది రోజులుగా చిన్నారులకు ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో సిబ్బంది పోతలయ్య, సురేంద్రతో పాటు పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు మేలు

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, సృజనాత్మకతను పెంపొందించే డ్రాయింగ్, చెస్, యోగా వంటి వాటిపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

తలుపుల: కేతిరెడ్డివారిపల్లికి చెందిన వారు తమను కులం పేరుతో దూషించినట్లు మండల కేంద్రంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన కుళ్లాయప్ప గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న తనతోపాటు మరో నలుగురు బైక్‌పై గండిక్షేత్రానికి వెళ్తుండగా గాలివాండ్లపల్లి వద్ద ఆగామన్నారు.

ఈసందర్భంగా కేతిరెడ్డివారిపల్లికి చెందిన టీడీపీ నేత విజయారెడ్డి, అతని సోదరులిద్దరూ కులం పేరుతో తమను దూషించారన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.